క్లుప్తంగా

12 నుంచి 'ఇగ్నో' టర్మ్ ఎండ్ పరీక్షలు

రామన్నపేట : ఈనెల 12 నుంచి జూలై 19 వరకు ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) టర్మ్ ఎండ్ పరీక్షలు-2025 నిర్వహించనున్నట్లు వరంగల్ లాల్‌బహదూర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు, ఇగ్నో అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ యస్‌వీ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యార్థులతో పాటు డిప్లొమా, పీజీ డిప్లొమా ప్రోగ్రాంలకు సంబంధించిన విద్యార్థులు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్ల కోసం www.ignou.ac.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98493 81085 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సీపీని కలిసిన సీఐ



సీపీకి పూలమొక్క అందజేస్తున్న సీఐ

వరంగల్ క్రైం : మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బొల్లం రమేశ్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందాలన్నారు.

మాతృత్వపు అనుభూతి..



చిన్నారిని ఎత్తుకుని మురిసిపోతున్న ఎంపీ కావ్య

హన్మకొండ చౌరస్తా: తాను ఓ ఎంపీ, ఓ డాక్టర్ అయితే నేమీ.. అమ్మతనం ముందు అవన్నీ దిగదుడుపే. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సమీక్షకు హాజరైన ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆస్పత్రిలోని నెలలు నిండని ఓ చిన్నారిని ఎత్తుకుని మురిసిపోయింది. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్యలతో కలిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీ, బాలింతలకు బ్రెడ్, బిస్కెట్లను అందజేశారు.

పదోన్నతులతో మరిన్ని బాధ్యతలు




శివకృష్ణ భుజానికి స్టార్ అలంకరిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: పోలీస్ అధికారులకు పదోన్నతులతో మరిన్ని బాధ్యతలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శివకృష్ణ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మంగళవారం శివకృష్ణ భుజాలపై సీపీ చేతుల మీదుగా స్టార్(నక్షత్రాన్ని) అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఐకి సన్మానం

కాజీపేట : కాజీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం రాత్రి సీఐ ప్రమోషన్‌తో బదిలీపై వెళ్తున్న శివకృష్ణను సహచర పోలీసులతో పాటు పుర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ వై.సుధాకర్‌రెడ్డి బదిలీపై వెళ్తున్న శివకృష్ణను శాలువలు కప్పి మెమోంటోతో సత్కరించారు. ఎస్సైలు నవీన్ కుమార్, లవన్‌కుమార్, పాల్గొన్నారు.

'సహృదయ'లో జన్మదిన వేడుకలు



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ సహృదయ అనాథ ఆశ్రమంలో మంగళవారం రాత్రి బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు జాజుల శ్రీనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. వేణుగోపాల్, యాదగిరి, పి.శంకర్, పవన్, ప్రతాప్, టి.రమేష్, అనిల్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి : బర్త్‌డేలు, మ్యారేజ్‌డేలు అనాథ వృద్ధుల మధ్య జరుపుకోవాలని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. వాసవిక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ జన్మదిన వేడుకలు భీమారంలోని లార్డ్ వృద్ధాశ్రమంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

పరామర్శ

హన్మకొండ అర్బన్ : ఇటీవల మృతి చెందిన హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

స్తంభాలు వేశారు.. వీధి లైట్లు మరిచారు

- అంధకారంలో భీమారం–గోపాలపురం రహదారి
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

హసన్‌పర్తి : గోపాలపురం జంక్షన్ నుంచి భీమారం రహదారి అంధకారంలో కూరుకుపోయింది. ఈ మార్గంలో వీధి దీపాలు లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పు పేరిట విద్యుత్ స్తంభాలు తొలగించారు. ఆ తర్వాత కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వీధిలైట్లు బిగించలేదని స్థానికులు చెప్పారు. దీంతో రాత్రి వేళ ఈ ప్రాంతంలో చీకటి కమ్ముకునిపోవడం వల్ల వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఓ వెపు రోడ్డుపై కుక్కల సంచారం అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. తెల్లవారుజామున రోడ్లపై కుక్కల బెడద చూసి వాకర్స్ భయాందోళనకు గురవుతున్నారు. గోపాలపురం జంక్షన్, అరుణోదయ కాలనీల వద్ద హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు స్థానికుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు కాలనీవాసులు లిఖితపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



హసన్‌పర్తి : గోపాలపురం-భీమారం ప్రధాన రహదారి



వీధి లైట్లు బిగించకుండా ఉన్న విద్యుత్ స్తంభం

స్ఫూర్తి కార్యక్రమం అభినందనీయం

- యూనిసెఫ్ చీఫ్ డాక్టర్ జలాలం

న్యూశాయంపేట: జిల్లాలో చేపట్టిన స్నేహ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమాలు అభినందనీయమని యూనిసెఫ్ చీఫ్ డాక్టర్ జలాలం అన్నారు. వరంగల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్నేహ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. డాక్టర్ జలాలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ హెడ్ మాస్టర్లతో అవగాహన సదస్సులు నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించిన కలెక్టర్ కృషిని కమిటీ అభినందించింది. జిల్లాలో స్నేహ కార్యక్రమాలు, అధికారుల అభిప్రాయాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ బాలల సంఘాలు, మహిళా సంఘాలు, వయో వృద్ధుల సంఘాలు ఒకదానికొకటి అనుసంధానంగా పనిచేయాలని సూచించారు. స్నేహ కార్యక్రమం బలోపేతం చేయాలని సెర్ప్ ప్రతినిధి జమున సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అధికారులు

టీపీసీసీలో బీసీలకు పెద్దపీట

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్

హన్మకొండ: టీపీసీసీలో బీసీలకు ఆ పార్టీ పెద్దపీట వేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఈవీ శ్రీనివాస్‌రావును బీసీ సంక్షేమ సంఘం నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బైరి రవి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే సామాజిక న్యాయం పాటిస్తుందన్నారు. బీసీల రిజర్వేషన్లకు అడ్డంకులు లేకుండా చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఢిల్లీలో చేపట్టిన బీసీల పోరుగర్జన సభకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచిందన్నారు. టీపీసీసీ చీఫ్ కాంగ్రెస్ అంటేనే బహుజనుల పార్టీగా ముద్ర వేసే దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి, శంకర్, పవన్, ప్రతాప్, రమేష్ గౌడ్, కరణ్, అనిల్ పాల్గొన్నారు.



ఈవీ శ్రీనివాస్ రావును సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న సీఐ కిషన్, ఎస్సై రాజ్‌కుమార్

మడికొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని నాసిరకం విత్తనాలను విక్రయించిన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మడికొండ సీఐ కిషన్ హెచ్చరించారు. మంగళవారం మడికొండ ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలో గతంలో నకిలీ విత్తనాలను విక్రయించిన వారి వివరాలను సేకరించి సోమవారం ఐదుగురిని, మంగళవారం 8 మందిని అదుపులోకి తీసుకోని కాజీపేట తహసీల్దార్ బాహుసింగ్ ఎదుట బైండోవర్ చేశారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

- లేకుంటే బిల్లుల్లో కోత తప్పదు
- క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : స్మార్ట్‌సిటీ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పరిధిలోని భద్రకాళి బండ్ , బి ఆర్ నగర్, మడికొండ, కడిపికొండ, గోకుల్ నగర్ ప్రెసిడెన్సీ స్కూల్, రాజాజీనగర్ కల్వర్టు తదితర ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి కొనసాగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భద్రకాళి బండ్ పైన 90 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందని, డ్రెయిన్ పనులను వెంటనే పూర్తి చేసే విధంగా ఇంజినీర్లు చొరవ తీసుకోవాలని హెచ్చరించారు.సకాలంలో పనులు పూర్తి చేయకపోతే ఇంజినీర్లకు శాఖాపరమైన చర్యలు, కాంట్రాక్టర్లకు బిల్లుల్లో కోత విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్, ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, డీఈ లు రవి కిరణ్, రాజ్ కుమార్, ఏఈలు, స్మార్ట్ సిటీ ప్రతినిధులు ఉన్నారు.



భద్రకాళి బండ్ వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రామన్నపేట : రాష్ట్రంలో అర్చకుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు చేస్తున్న కృషి అభినందనీయమని తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వ పలు పథకాలకు సంబంధించిన బ్రోచర్‌ను దేవాదాయ శాఖ సెక్రటరీ శైలజారామయ్యర్‌లు ఆవిష్కరించడంపై మంగళవారం ధార్మిక భవన్ వద్ద అర్చక, ఉద్యోగుల అధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ బ్రోచర్ విడుదల చేయడంపై రాష్ట్రంలోని 13 వేల దేవాలయాల్లో సీఎం, మంత్రి సురేఖ పేర్లపై పూజలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్ శర్మ, జేఏసీ సభ్యులు రాజేష్‌చార్యులు, శ్రీధరాచార్యులు, అనిల్‌కుమార్, అభిలాష్‌శర్మ, శివకుమార్, శంభులింగం, సాంబయ్య, రామశర్మ, రవీందర్‌శర్మ, త దితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

కేవీలో ముగిసిన భారతీయ భాషా సమ్మర్ క్యాంప్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుభాషిణి

కాజీపేట అర్బన్ : కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో మంగళవారం భారతీయ భాషా సమ్మర్ క్యాంప్ ముగిసింది. విద్యార్థులకు అన్ని రాష్ట్రాల భాషలపై పట్టు ఉండాలని, ఇందుకుగాను తెలంగాణ రాష్ట్ర భాష తెలుగు, తమిళనాడు రాష్ట్ర భాష తమిళంపై విద్యార్థులు పట్టు సాధించేందుకు పది రోజుల సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించినట్లు కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. రాష్ట్ర భాషతో పాటు ఆచార వ్యవహారాలు, చారిత్రాత్మక ప్రదేశాలు, వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు , వంటలు, సినీ ప్రముఖుల గురించి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాష శిక్షకులు రమ్య పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

హసన్‌పర్తి: విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ అన్నారు. సూచించారు. కిట్స్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్‌రెడ్డి, అసోసియేషన్ కోశాధికారి నాగకిషన్, వైస్ ప్రసిడెంట్ మోహన్ రావు, పీడీలు ఎం. శ్రీనివాస్‌రెడ్డి, జి.కిశోర్, భాస్కర్, కృష్ణవేణి, శైలజా, ప్రభాకరాచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

భూములు కొన్నాం.. పట్టా చేసుకోలేదు

- సాదా బైనామా వర్తింపజేయండి
- బాధితుల ఆందోళన

హసన్‌పర్తి : పట్టాదారుల నుంచి తెల్లకాగితంపై భూములు ఖరీదు చేశాం. ఆ భూములను ఇప్పటి వరకు పట్టా చేసుకోలేదని బాధితులు తెలిపారు. మంగళవారం మండలంలోని వంగపహాడ్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. బాధిత రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా తమ ఆవేదనను వెలిబుచ్చారు. 15 ఏళ్ల క్రితం పట్టాదారుల నుంచి భూములు ఖరీదు చేశామని, రాసిన కాగితం ఉంటే సరిపోతుందని భావించి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్పు చేసుకోలేదని తెలిపారు. గ్రామాల్లో సాదా బై నామా వర్తింపునకు అవకాశం కల్పించిన ప్రభుత్వం నగరంలో విలీనమైన గ్రామాల్లో కూడా ఆ అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎండి. రహీం, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రఘు పాల్గొన్నారు.

తెలియక అసైన్డ్ భూములు ఖరీదు..

వంగపహాడ్‌లోని సర్వే నంబర్ 516లో దళితులకు అసైన్డ్ చేసిన భూములను కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు. మోకాపై తామే సాగు చేసుకున్నప్పటికీ రికార్డుల్లో మాత్రం అసైన్డ్‌దారుల పేర్లు నమోదవుతూ వస్తున్నాయని చెప్పారు. పీఓటీ యాక్ట్ కింద అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



ఖిలావరంగల్ : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగేశ్వర్‌రావు

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

ఖిలా వరంగల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి పోర్టల్ అమలులో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నాగేశ్వర్‌రావు హాజరై రైతులు, ప్రజల నుంచి భూ సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ కీర్తన్, దామోదర్‌యాదవ్, సురేష్, చందర్, శ్రావణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చార్జీలను వెంటనే తగ్గించాలి

నయీంనగర్ : పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

కాకతీయ ఆర్చ్‌కు అడ్డంగా..



ఈ ఫొటో చూడండి. హనుమకొండ కలెక్టరేట్ ముందు కాకతీయ కళావైభవానికి గుర్తుగా ఏర్పాటు చేసిన స్వాగత కళాతోరణం కనిపించకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వాస్తవానికి కలెక్టరేట్ ముందు ఎటువంటి ఫ్లెక్సీలు కట్టొద్దు. కానీ, కొత్త మంత్రులకు స్వాగతం పలుకుతూ తోరణానికి అడ్డుగా ఓ అధికార పార్టీ నాయకుడు ఏర్పాటుచేసిన ఈ ఫ్లెక్సీ రోజూ అక్కడి నుంచి తిరిగే జిల్లా ఉన్నతాధికారులకు కనిపించకపోవడం గమనార్హం.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

ప్రతిభతో విద్యార్థినులకు నియామకాలు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాలలోని పలువురు బీబీఏ రిటైల్ ఆపరేషన్ విద్యార్థినులు ప్రముఖ కార్పొరేట్ సంస్థలకు ఆన్‌ది జాబ్ ట్రెనింగ్ నియామకాలకు ఎంపికవడం అభినందనీయమని హెదరాబాద్‌లోని రిటైల్ అసోసియేషన్ అండ్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (రాసి) మేనేజర్ చందావడ్డె అన్నారు. మంగళవారం ఆ కళాశాలలో విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, వాణిజ్యశాస్త్ర విభాగం అధిపతి సారంగపాణి, బీబీఏ కోర్సు ఇన్‌చార్జ్ సుమలత ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాసి మేనేజర్ చందావడ్డె

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజె హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఆయా జిల్లాల కలెక్టర్లు విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసేవారని ఆ ఆనవాయితీ ఇప్పటికి కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు బూరం ప్రశాంత్, తాళ్లపెల్లి వేణుగోపాల్, యూనియన్ నాయకులు అశోక్, బత్తిని రాజేందర్, సత్యనారాయణ, గోకారపు శ్యాంకుమార్, బుడిగే శ్రీనివాస్, ఆదర్శ్ పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

హన్మంతరావు లేని లోటు తీర్చలేనిది

మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దేశినేని హన్మంతరావు లేని లోటు పూడ్చలేనిదని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన హన్మంతరావు దశదినకర్మ మంగళవారం కరుణాపురంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో సంతాపసభ నిర్వహించారు. స్టేషన్ ఘన్‌పూర్, పరకాల ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, మేయర్ సుధారాణి పాల్గొని నివాళులర్పించారు.

జర్నలిస్టుల అరెస్టు పత్రికా స్వేచ్ఛను హరించడమే

హన్మకొండ: జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం, అక్రమ అరెస్టులు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మునిగాల కళ్యాణ్ రాజ్ పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. సాక్షి కార్యాలయాలపై దాడులు చేయడం, దౌర్జాన్యాలకు పాల్పడడం అరాచక పాలనకు అద్దం పడుతుందని దుయ్యబట్టారు.

కార్మికుల డిమాండ్లను పరిశీలించాలి

వరంగల్ అర్బన్ : మునిసిపల్ కార్పొరేషన్ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తికి పరామర్శ

ఖిలా వరంగల్: భూమిని కబ్జా చేశారని మనస్తాపంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన పోలెపాక కుమారస్వామిని మంగళవారం ఎంజీఎం ఆస్పత్రిలో వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్, ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందుగా ఘటన స్థలాన్ని సందర్శించి సాక్షులను విచారించారు. దళిత సంఘాల ప్రతినిధులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్ దుండగులను అరెస్ట్ చేయాలని ఏసీపీకి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏసీపీ స్పందించారు. ఆత్మహత్యాయత్నానికి కారకులైన బండి కుమారస్వామి, తాళ్ల మల్లేశం, పులి రంజిత్‌రెడ్డిలపై సెక్షన్లు 292, 108 r /w 62.r/w 3(5)bns,3(1)3(2)(వి) ఎస్సీ, ఎస్టీ అక్ట్ 2015 నమోదు చేశామని, దుండగులనుఅరెస్టు చేసి చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

కాలనీ అభివృద్ధికి అండగా ఉంటా

నయీంనగర్ : కాలనీవాసులు స్వచ్ఛందంగా కలిసి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమం ప్రశంసనీయమని, కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 54వ డివిజన్ పోచమ్మకుంట హనుమాన్‌నగర్ స్వాగత తోరణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

వరంగల్ : ఈనెల 18 నుంచి 23 వరకు బిహార్‌లోని నవ్వడలో జరిగే 47 జాతీయ జూనియర్ బాలికల జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జట్టులోని పైడిపల్లికి చెందిన క్రీడాకారులను స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి మంగళవారం అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

ఖిలా వరంగల్ : 17వ డివిజన్ పరిధి వసంతాపురంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరై ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. 93 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎంజీఎం : ఎంజీఎంలోని పేషెంట్లు, వారి వస్తువుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఎంజీఎం సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంజీఎం ఆర్ఎంఓ ఆధ్వర్యంలో భద్రత విషయంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

ఖిలా వరంగల్ : వరంగల్ 39వ డివిజన్ సాకరాశికుంటలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సుభాషిణి ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎం.రమాదేవి హాజరై బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. పడమరకోట కేంద్రంలో సూపర్‌వైజర్ కళ్యాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

వరంగల్ : పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. వరంగల్ 21వ డివిజన్‌లో వాసన్ ఐ కేర్, అక్యుపెంచర్ వైద్యులు డాక్టర్ భానుల సహకారంతో బీజేపీ, పద్మశాలి సేవా సంఘాల అధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

దివ్యాంగురాలు ఆర్పీపై దాడికి యత్నం

ఖిలా వరంగల్ : వరంగల్ 36వ డివిజన్ చింతల్ ఆర్ఎస్ నగర్‌కు చెందిన దివ్యాంగులైన ఆర్పీ రామగిరి కనకలక్ష్మి మహిళ సంఘాల గ్రూపులకు లోన్స్ అందించి పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తున్నారు. తన పని తనాన్ని జీర్ణించుకోలేని తోటి మహిళలు సోమవారం కనకలక్ష్మిపై దాడికి యత్నించగా స్థానిక మహిళలు అడ్డుకొని అక్కడి నుంచి పంపించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్ మంగళవారం ఆమెను పరామర్శించారు.

అనుమతి లేని పాఠశాలపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి : వరంగల్ ఎల్‌బీనగర్ ప్రాంతంలో అనుమతిలే కుండా కొనసాతన్న ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలని మంగళవారం ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, స్వేరోస్ బాధ్యులు రాజేంద్రప్రసాద్, బీఎస్ఎఫ్ నాయకులు రమేష్ వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు.

'మెడికవర్'లో అరుదైన శస్త్రచికిత్స

కాజీపేట అర్బన్ : హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్‌లో గాల్ బ్లాడర్‌కు స్టేజింగ్ లాప్రోస్కో, రాడికల్ కోలీసిస్టెక్టమీ అత్యాధునిక గాల్ బ్లాడర్ క్యాన్సర్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ గాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ సునీల్ తెలిపారు. వరంగల్‌కు చెందిన 47 ఏళ్ల రమ 45 రోజులుగా పొట్ట నొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రులను సంప్రదించగా సరైన చికిత్స అందలేదు. ఇటీవల మెడికవర్ హాస్పిటల్‌కు రాగా పలు రకాల పరీక్షలు నిర్వహించగా గాల్ బ్లాడర్ క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. అత్యాధునిక శస్త్ర చికిత్సను అనస్తీషియా డాక్టర్ వాసుతో కలిసి నిర్వహించామని డాక్టర్ తెలిపారు.

కోటి విత్తనాల సేకరణ

కాజీపేట : కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీకి చెందిన పర్యావరణ ప్రేమికుడు ప్రకాశ్ మంగళవారం సోమిడిలో రామకోటి విత్తనాల సేకరణ చేపట్టారు. కొంతమంది యువకులతో కలిసి కానుగ విత్తనాలను వేల సంఖ్యలో సేకరించారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి. చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)